ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
ఆదివారం 26 అక్టోబరు 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 23.0

నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని 29న ర్యాలీ

నూజివీడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని, ప్రజాభీష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేలా జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 29న ర్యాలీ నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు. నూజివీడు ఆర్ అండ్ బి అతిథిగృహంలో బార్ అసోసియేషన్, వర్తక వాణిజ్య సంఘాలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ తదితరులు శనివారం సమావేశం నిర్వహించారు. నూజివీడుకు ఉమ్మడి కృష్ణాజిల్లాతో అనుబంధం, ప్రజల సెంటిమెంట్‌ను జిల్లాల పునర్వ్యవస్థీకరణ కమిటీ, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేలా కార్యాచరణ రూపొందించనున్నారు. జేఏసీ ఏర్పాటు, సెంటిమెంట్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతూ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ఏలూరు రూరల్, అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ జిల్లా విభాగం ఆధ్వర్యంలో ఫార్మర్ మాస్టర్ ట్రైనర్స్‌కు రెండు రోజుల శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.వెంకటేష్ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించడం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవచ్చన్నారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. రైతులకు బయోకంట్రోల్ పద్ధతులు, జీవామృతం, ఘన జీవామృతం, కీటకనాశక తయారీ విధానాలు వంటి అంశాలపై వివరించారు. నిపుణులు ప్రాక్టికల్ డెమో నిర్వహించారు. ఎఫ్ఎంటీలు, శిక్షణ బృంద సభ్యులు, రైతు ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి : ఎంపీ పుట్టా
ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో కార్డియాలజీ, న్యూరో ఓపీ సేవలు

ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్?
ఉమ్మడి జిల్లాలో 5 వేల మంది అంచనా!
సంక్షోభాన్ని పరిష్కరించే దిశగా కేంద్రం జోక్యం?

లోపలి పేజీల్లో..



అమ్మా.. నాగమ్మా..

నాగుల చవితి పూజలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పుట్టల్లో పాలు పోసి బియ్యం, నువ్వుల పిండి ముద్దలు, నూక, గుడ్లు, పండ్లు నాగమ్మకు సమర్పించారు. పుట్ట మట్టిని తిలకధారణ చేసుకున్నారు.

ఏలూరు అశోక్ నగర్ ఆలయ ఆవరణలో పుట్ట వద్ద భక్తుల రద్దీ

అటు విధులు.. ఇటు పూజలు

నాగులచవితి సందర్భంగా ఏలూరు త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు విధులకు వెళుతూ.. కుటుంబ సభ్యులతో కలిసి పుట్టలో పాలు పోసి పూజలు చేశారు.



ఆర్టీసీ పెట్రోలు తాగేశారు!

ఏలూరు బంక్‌లో ఆర్థిక అవకతవకలు

జిల్లా కేంద్రమైన ఏలూరు ఆర్టీసీ బంకులో సంస్థ సిబ్బంది అక్రమాలకు తెరతీశారు. . లక్షలాది రూపాయలు స్వాహా చేశారు. అసిస్టెంట్ డిపో క్లర్క్ ప్రధాన సూత్రధారుడిగా ఆరోపణలున్నాయి. ఆయనతో పాటు మరో 14 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఏకమయ్యారు. బిల్లులకు లెక్కచూపకుండా దాదాపు రూ.83 లక్షలు స్వాహా చేశారు. అధికారులు నెలరోజుల పాటు తనిఖీలు, విచారణ పూర్తి చేశారు. బాధ్యులపై చర్యలకు సమాయత్తం అవుతున్నారు.

- ఐదేళ్లలో రూ.83 లక్షలు స్వాహా
- ఏడీసీ, మరో 14 మందిపై విచారణ పూర్తి
- నేడో, రేపో బాధ్యులపై చర్యలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఏలూరు కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆర్టీసీ నిర్వహణలో ఉన్న పెట్రోలు బంకులో ఆర్థిక అవకతవకలు బయటపడ్డాయి. 2021లో వైసీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి రవాణాశాఖ మంత్రి పేర్నినాని ఈ బంకు ప్రారంభించారు. ఆర్టీసీ డిపో, కార్గో అసిస్టెంట్ మేనేజర్లు పర్యవేక్షణ లేకపోవడంతో ఏడీసీ స్థాయి క్లర్క్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది లక్షల్లో అవకతవకలకు పాల్పడ్డారు. ఇటీవల ఆడిటింగ్ అధికారులు తనిఖీ చేయగా రూ.83 లక్షల మేర బిల్లులకు లెక్కలు, రశీదులు లేవు. రికార్డుల్లో తేడాతో అవకతవకలు జరిగినట్లు తేలింది. తర్వాత ఆర్టీసీ ఉన్నతాధికారులు, విజిలెన్స్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు కూడా ఆరా తీయడంతో ఈ మొత్తాలను సొంతానికి వాడేసుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

డిజిటల్ పేమెంట్ నొక్కేశారు

2021-2025 మధ్య కాలంలో రోజూ బంకులో నగదు జమ, గూగుల్, ఫోన్‌పే మొత్తాలను బిల్లులతో కలిపి సంస్థ పేరిట జమ చేయాల్సి ఉంది. ప్రతీ రోజు సుమారు నగదు రూ.4లక్షలు, ఫోన్ పే, గూగుల్ పే ద్వారా రూ.40 వేలు వసూలైతే మరుసటి రోజు చేతివాటం ప్రదర్శించారు. ఫోన్‌పే లావాదేవీల పాత బిల్లులను ఆ మొత్తాలతో భర్తీ చేసి నిధులు స్వాహా చేశారు. ఇందులో ఏడీసీ పాత్ర కీలకంగా చెబుతున్నారు. అతని సొంత బ్యాంకు ఖాతాల్లో లావాదేవీలు ఆరా తీస్తే వాస్తవాలు బయటపడతాయని చెబుతున్నారు. ఆడిట్ లెక్కల్లో తేడాగా పరిగణించిన మొత్తాన్ని స్వాహా చేసినట్లు గుర్తించి బాధ్యులపై కేసులు లేకుండా చేయాలని చూస్తున్నారని చెబుతున్నారు.



ఏలూరు ఆర్టీసీ కొత్త బస్టాండ్ వద్ద బంక్

కొంత మొత్తం జమ?

ఇదిలా ఉండగా బంకు లావాదేవీలు పర్యవేక్షించాల్సిన వారు ఉద్యోగాలు కోల్పోతామన్న భావనతో కొన్ని లక్షలు నగదు సంస్థకు జమ చేసినట్లు తెలిసింది వారిపై సంస్థాగత చర్యలు లేకుండా చూసుకునే విధంగా జాగ్రత్త పడినట్లు విమర్శలు వస్తున్నాయి. మరోవైపు సిబ్బందిని కాపాడడానికి ఎత్తుగడ అయి ఉండవచ్చని చెబుతున్నారు.

అధికారుల మాటేమిటి?

బంకు లావాదేవీలపై సంస్థ అధికారులు ఆడిట్ చేయలేదు. పర్యవేక్షణ చేయని డీఎంలు, ఇతర పర్యవేక్షణాధికారులను విచారించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అసలు సూత్రధారులెవరో ఉన్నతాధికారుల చర్యలతోనే బయటపడుతుందని చెబుతున్నారు. ఈ విషయంపై డీపీటీవో షేక్ షబ్బీం మాట్లాడుతూ అవకతవకలపై కచ్చితంగా చర్యలు ఉంటాయన్నారు.

జిల్లా ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ అమలు

ఏలూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గుడ్ గవర్నెన్స్‌లో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ విధానాన్ని అమలు చేయాలని కలెక్టర్ కె వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఈ-ఆఫీస్ విధానం అమలుపై వివిధ శాఖల అధికారులతో శనివారం ఆమె సమీక్షించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అన్ని రికార్డులు డిజిటలైజేషన్ చేయాలని, ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు ఈ-ఆఫీస్ ద్వారా జరగాలన్నారు. డిజిటల్ యుగంలో ప్రభుత్వ కార్యాలయాల్లో కాగిత రహిత కార్యకలాపాలు జరగాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి విశ్వేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెరువుల పనులు చేపట్టాలి

జిల్లాలో రూ.258 కోట్లతో 350 మైనర్ ఇరిగేషన్ చెరువుల పనులకు ప్రభుత్వ అనుమతి రాగానే పనులు చేపట్టాలని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. అధిక వర్షాల నేపథ్యంలో చెరువుల పటిష్టతపై పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చోట్ల ఇసుక బస్తాలు తగినన్ని నిల్వలు పెట్టుకోవాలని సూచించారు. ఇటువంటి విషయాల్లో అలసత్వం వహించకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జలవనరులశాఖ డిప్యూటి సూపరింటెండెంట్ ఇంజనీర్ ధనుంజయ, డీఈలు పి గనిరాజు, ధర్మజ్యోతి, అర్జునరావులు పాల్గొన్నారు.

నిషేధిత భూముల వినతులు పరిష్కరించాలి

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 22ఏ కింద వివిధ భూములను నిషేధిత జాబితాలో చేర్చిన వాటిపై ప్రజల నుంచి వచ్చిన వినతులను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో తహసీల్దార్లతో పలు అంశాలపై శనివారం సమీక్షించారు. జిల్లాలో 22ఏ కింద 111 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పది రోజుల గడువుపెట్టుకుని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల స్థలాల లే-అవుట్లను విధిగా ఉదయం, సాయంత్రం వేళల్లో తనిఖీ చేపట్టి ఇంకా అర్హులుంటే వారికి పట్టాల జారీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమీక్షలో జేసీ అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ వినూత్న, డీఆర్వో వి విశ్వేశ్వరరావు, ఆర్డీవోలు పాల్గొన్నారు.



ప్రైవేటు బస్సులను తనిఖీలు చేస్తున్న రవాణాశాఖ అధికారులు

ప్రైవేటు బస్సులపై నిఘా

- జంగారెడ్డిగూడెం, కలపర్రులో రవాణాశాఖ తనిఖీలు
- 55 బస్సు నిర్వాహకులపై కేసు.. మూడు బస్సులు సీజ్
- రూ. 2.80 లక్షల జరిమానా

ఏలూరు క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలులో వేమూరి కావేరి బస్సు అగ్నిప్రమాదానికి గురైన సంఘటన నేపథ్యంలో రవాణాశాఖ అధికారులు అప్రమత్తమై ప్రైవేటు ట్రావెల్ బస్సులపై కొరడా ఝుళిపించారు. ఏలూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ ఆదేశాల మేరకు ఆర్టీవోలు ఎస్‌బి శేఖర్, ఎస్ఎస్ రంగనాయకులు పర్యవేక్షణలో జంగారెడ్డిగూడెంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకూ తనిఖీలు నిర్వహించారు. ఏలూరు సమీపంలోని 16వ నెంబర్ జాతీయ రహదారి కలపర్రు టోల్‌గేటు వద్ద తనిఖీలు నిర్వహించారు. రికార్డు ప్రకారం ఇంజన్, చాసిస్, రిజిస్ట్రేషన్ నంబర్లు స్వయంగా పరిశీలించారు. డోర్ సెన్సర్లు పనితీరు, అగ్నిప్రమాదం జరిగినప్పుడు మంటలను ఆర్పడానికి అవసరమైన పరికరాలు పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన 55 బస్సుల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. మూడు బస్సులను సీజ్ చేశారు. మొత్తం రూ.2.8 లక్షల జరిమానా విధించారు. 8 మంది మోటారు వాహన ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

పశ్చిమలో 8 బస్సులపై కేసు

పశ్చిమ గోదావరి జిల్లాలో శనివారం చేపట్టిన తనిఖీలో దాడుల్లో 8 బస్సుల నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా రవాణా శాఖ అధికారి ఆర్.కృష్ణారావు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామన్నారు.

ముంచుకొస్తున్న మొంథా

అధికారులు, ప్రజలు అప్రమత్తం కావాలి : కలెక్టర్

- వాతావరణ శాఖ హెచ్చరిక
- పొంచి ఉన్న ముప్పు
- రైతుల ఆందోళన
- అధికారులతో కలెక్టర్ సమీక్ష
- జిల్లాలో కంట్రోల్ రూమ్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఈనెల 27న తీవ్ర తుఫాన్‌గా మారనుంది. మొంథాగా పిలిచే తుఫాన్ ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ చెబుతోంది. మచిలీపట్నం- కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని, తీరం దాటే సమయంలో గాలుల తీవ్రత గరిష్ఠంగా గంటకు 90 నుంచి 110 కిలోమీటర్లు వరకు ఉంటుందని చెబుతున్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు

జిల్లాలో మొంథా తుఫాను ప్రభావం తీవ్ర స్థాయిలో ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి విజ్ఞప్తిచేశారు. కలెక్టరేట్‌లో శనివారం అత్యవసర సమావేశం నిర్వహించి ముందస్తు చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ఈనెల 28, 29 తేదీలలో తీవ్రమైన గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గాలులకు హోర్డింగ్స్, స్థంభాలు, చెట్లు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, పూరిళ్లు కూలిపోవచ్చని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఎటువంటి ప్రాణ నష్టం సంభవించకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. నదులు, చెరువుల్లోకి ఎవరూ ఈతకు వెళ్లకుండా, మత్స్యకారులు చేపలవేటకు వెళ్లకుండా అప్రమత్తం చేయాలన్నారు. కొల్లేరు లంక ప్రాంతాల్లోని ప్రజలను చేపల వేటకు వెళ్లరాదని సూచించాలన్నారు. సమాచార వ్యవస్థ స్తంభించకుండా టెలికాం టవర్ల వద్ద జనరేటర్లు సిద్ధం చేయాలన్నారు. వాటి ఏర్పాట్లను సంబంధిత మండల తహసీల్దార్లు తనిఖీ చేయాలన్నారు. తుఫాను ప్రమాదం తొలగే వరకు జిల్లాలో అధికారులు, సిబ్బంది ప్రధాన కార్యస్థానాలలో ఉండాలని, ప్రజలకు అవసరమైన సేవలందించాలన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్‌రూమ్స్ ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించాలన్నారు. లోతట్టు ప్రాంతాలలో ప్రసవ సమయానికి దగ్గరగా ఉన్న గర్భిణులను దగ్గరలోని పీహెచ్‌సీలకు తరలించాలని, సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్న కల్వర్టులు, కాజ్‌వేలు, వాగులను ప్రజలు దాటకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించాలన్నారు. విద్యుత్ ప్రమాదాల కారణంగా ఏ ఒక్కరు ప్రాణాలు పోకుండా విద్యుత్ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఏలూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మొంథా తుపాను నేపథ్యంలో ఏలూరు జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కంట్రోల్‌రూమ్ నంబర్లు 9491041419, టోల్‌ఫ్రీ నంబర్ 18002331077 గా కలెక్టర్ ప్రకటించారు.

రేపు పీజీఆర్ఎస్ రద్దు

ప్రజా సమస్యలపై అర్జీలను స్వీకరించడానికి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రకటించారు. తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో మార్పును ప్రజలు గమనించాలన్నారు.

కలెక్టర్‌తో సీఎస్ సమీక్ష

జిల్లాలో 'మొంథా తుఫాన్'ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాగాన్ని అప్రమత్తం చేశామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు తెలిపారు. తుఫాన్ అప్రమత్తతపై కలెక్టర్లతో సీఎస్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తీవ్రమైన గాలులు, భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని, సూచించారు. జిల్లాలో చేపట్టిన ముందస్తు చర్యలను కలెక్టర్ వెట్రిసెల్వి వివరించారు.

అధికారులకు సెలవులు కట్

జిల్లాలో వరద తుఫాన్ ప్రమాదం ముగిసే వరకు అధికారులు, సిబ్బందికి సెలవులు మంజూరు చేయడం జరగదని కలెక్టర్ స్పష్టం చేశారు. సెలవులో

మిగతా 8వ పేజీలో..




సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్, ఏఎస్పీ

నేరస్తులకు శిక్ష పడాలి : ఎస్పీ

ఏలూరు క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నేరస్తులు శిక్ష తప్పించుకోకూడదని, బాధితులు న్యాయం పొందేలా పోలీసులు సమర్థవంతంగా పనిచేయాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం కోర్టు మానిటరింగ్‌సెల్ సభ్యులతో సమీక్షా సమావేశాన్ని, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కోర్టులలో పెండింగ్ కేసులపై సమీక్ష చేశారు. కేసుల విచారణ వేగవంతం జరగడానికి పలు సూచనలు చేశారు. సాక్ష్యులను సకాలంలో కోర్టులో హాజరు పరడం వల్ల విచారణ వేగంగా జరిగి బాధితులకు సత్వర న్యాయం చేకూరుతుందన్నారు. విచారణలో జాప్యం జరుగకుండా చూడాల్సిన బాధ్యత కోర్టు మానిటరింగ్ సభ్యులదేనన్నారు. కోర్టులలో విచారణలో ఉన్న కేసుల వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, డీసీఆర్బీ ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

స్మార్ట్‌ఫోన్‌తో విద్యార్థులకు దృష్టి లోపం

పాఠశాలలో కంటి పరీక్ష శిబిరం ప్రారంభించిన మంత్రి పార్థసారథి



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి, ఎంపీ మహేశ్, తదితరులు

ఏలూరు అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బాల్యంలో స్మార్ట్ ఫోన్లను అధికంగా చూడడం వల్ల కంటి సమస్యలు వస్తున్నాయని మంత్రి కె.పార్థసారథి అన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారి నేత్రాలు - సంరక్షణ పేరిట అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల దృష్టిలోప సమస్యలను గుర్తించడానికి శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఏలూరులో సుబ్బమ్మదేవి మునిసిపల్ హైస్కూలులో శనివారం మంత్రి శిబిరాన్ని ప్రారంభించారు. పిల్లలు దృష్టి సంబంధిత సమస్యలను బయటకు చెప్పలేరని, తల్లిదండ్రులు గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఆటపాటలు, పరిసరాల పరిశుభ్రత వైపు ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఇడా చైర్మన్ శివప్రసాద్, ఎస్ఎంఆర్ పెదబాబు, ప్రభుత్వ ఆసుపత్రి కంటి వైద్యుడు ఏఎస్.రామ్, సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఏలూరు ప్రతినిధి మారగాని చంద్రకిరణ్, డీవైఈవో రవీంద్రభారతి, ఎంఈవో అరుణ్‌కుమార్, హెచ్ఎం కుటుంబరావు, తదితరులు పాల్గొన్నారు.



పెద్దఎడ్లగాడి-పెనుమాకలంక రోడ్డును ముంచిన కొల్లేరు వరద


ఉప్పొంగుతున్న కొల్లేరు

మండవల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కొల్లేరు ఉప్పొంగుతోంది. ఇటీవల ముంపుతో అతలాకుతలమైన కొల్లేరు తీర ప్రాంతాల వారు తేరుకోక ముందే మళ్లీ వరద ముంపు పొంచి ఉంది. ఇప్పటికే పెద్ద ఎడ్లగాడి - పెనుమాకలంక రహదారిపై మూడు అడుగుల మేర నీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. భారీ వర్షాలతో ఒకేసారి ఎగువ నుంచి నీరు వచ్చి చేరడంతో కొల్లేరు ఉధృతంగా ప్రవహిస్తుంది. మరోపక్క పెద్దఎడ్లగాడి వంతెనకు గుర్రపుడెక్క మేట వేయడంతో వరద నీరు దిగువకు వెళ్లడం లేదు. ఎగువ నుంచి వస్తున్న వరద నీరు లంక గ్రామాలకు చేరడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెనుమాక లంక నుంచి నాటు పడవలపై పెద్దఎడ్లగాడి వరకు వచ్చి ఏలూరు కైకలూరు ప్రాంతాలకు వెళుతున్నారు. వర్షాల నేపథ్యంలో గుర్రపుడెక్కను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు

ఏలూరు సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఆయా ప్రాంతాలలో జనజీవనం స్తంభిస్తోంది. శనివారం జిల్లాలోని చాలా ప్రాంతాల్లో మబ్బులతో కూడిన వాతావరణం ఏర్పడి ఒక్కసారిగా భారీగానే వర్షాలు కురిశాయి. శనివారం మధ్యాహ్నం 3గంటల సమయంలో భీమడోలులో భారీ వర్షం కురిసింది. గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా జీలుగుమిల్లి మండలంలో

మిగతా 8వ పేజీలో..



దేవస్థానం గోశాలలో ఆవులు

1 నుంచి చిన వెంకన్న దేవస్థానంలో గోదత్తత, గోదానం

ద్వారకాతిరుమల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో లంప్‌స్కిన్ వ్యాధి తగ్గుముఖం పట్టిన కారణంగా వచ్చేనెల 1 నుంచి దేవస్థానం గోశాలలో గోవులను దత్తత ఇస్తామని, గోదానం తీసుకుంటున్నట్లు ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. రెండు నుంచి ఆరేళ్ల లోపు మంచి ఆరోగ్యంగా ఉన్న ఆవులను మాత్రమే తీసుకుంటామన్నారు. గోదానంగా భక్తుల నుంచి తీసుకునే ఆవులు, వాటి దూడలు గతంలో గాలికుంటు, ముద్ద చర్మవ్యాధులు సోకినవి కావని మండల పశువైద్యాధికారి నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని సూచించారు. ఈ నిబంధనల మేరకు మాత్రమే తాము గోదానం స్వీకరిస్తామని భక్తులు గమనించాలని ఈవో మూర్తి కోరారు.

నాగమ్మ తల్లీ..

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు

నాగుల చవితి పర్వదినం సందర్భంగా ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాల్లో వున్న పుట్టల్లో పాలుపోసి కోడిగుడ్లను వేసి పసుపు, కుంకుమలతో అర్చనలు జరిపి ప్రమిదలతో దీపాలను వెలిగించి ఆరాధించారు. పలువురు భక్తులు చెవిపోగులు కుట్టించుకున్నారు. చిన్నారులు బాణసంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు.


పెదపాడులో పుట్ట వద్ద భక్తుల పూజలు


అశోక్‌నగర్‌లో స్వామివారు


ఏలూరు బహుగుణ పోలీస్ స్కూల్ పుట్ట వద్ద పూజలు


ఏలూరు పోస్టల్ కాలనీలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో భక్తుల పూజలు


భీమవరం టూటౌన్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో..


ఆకివీడులో పుట్ట వద్ద భక్తుల పూజలు


తాడేపల్లిగూడెంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు


చొదిమెళ్ల సమీపంలో పుట్ట వద్ద పూజలు


టి.నరసాపురంలో నాగేంద్రస్వామికి పాలు పోస్తున్న అయ్యప్ప భక్తులు


పాలకొల్లు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలోని పుట్ట వద్ద భక్తుల పూజలు


భీమవరం-జువ్వలపాలెం రోడ్డులో వున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు



పుష్కరిణిని సుందరీకరిస్తున్న సిబ్బంది.. విద్యుత్ దీపాలంకరణ ఏర్పాట్లు

నవంబరు 2న శ్రీవారి తెప్పోత్సవం

» ముస్తాబవుతున్న సుదర్శన పుష్కరిణి

ద్వారకాతిరుమల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): క్షీరాబ్ది ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీవారి సుదర్శన పుష్కరిణిలో వచ్చేనెల రెండో తేదీ రాత్రి జరగనున్న స్వామివారి తెప్పోత్సవానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటివరకు చెత్తాచెదారంతో, తామర తూడుతో నిండి ఉన్న పుష్కరిణిలో గత పది రోజులుగా సిబ్బంది తూడు తొలగించారు. ఉభయదేవేరులతో చిన వెంకన్న పుష్కరిణిలో విహరించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పుష్కరిణి చుట్టూ విద్యుత్ తోరణాలను ఏర్పాటు చేస్తున్నారు. పుష్కరిణిలోని మురుగునీటిని తొలగించి అందులో పైపుల ద్వారా కొత్తనీటి నింపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉభయ నాంచారులతో కొలువైన శ్రీవారు ఆ రోజు సాయంత్రం తొళక్క వాహనంపై తిరువీధుల్లో ఊరేగి పుష్కరిణి వద్దకు చేరుకుంటారు. అనంతరం జరిగే తెప్పోత్సవ వేడుకను వీక్షించేందుకు భక్తులు తరలిరావాలని ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి కోరారు.

భక్తుల రద్దీ సాధారణం

శ్రీవారి సన్నిధిలో శనివారం భక్తుల సాధారణ రద్దీ నెలకొంది. తుఫాను ప్రభావం, నాగులచవితి పర్వదినం కావడంతో దాదాపు 12 వేల మంది వరకు యాత్రికులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. స్వామివారి దర్శనానికి దాదాపు గంటపైబడి సమయం పట్టింది. కేశ ఖండన శాలలో మొక్కుబడులు తీర్చుకున్న అనంతరం భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

క్రైం సమాచారం

ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతంతో యువకుడి మృతి


షాలేంరాజు (ఫైల్)

కాళ్ళ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన శనివారం కాళ్ల మండలం కోపల్లెలో జరిగింది. స్థానికులు తెలిపిన వివారలివి.. గ్రామానికి చెందిన కె.షాలేంరాజు(15) ఫ్లెక్సీ కడుతున్న సమయంలో ఐరన్ ఫ్రేమ్ విద్యుత్ తీగలకు తగిలి మృతికి కారణంగా తెలుస్తుంది. ఉపాధి నిమిత్తం విదేశాల్లో ఉంటున్న తల్లిదండ్రులు కుమారుడి మృతి చెందిన విషయం తెలిసి హుటాహుటిన గ్రామానికి వస్తున్నట్టు వారు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గోదావరిలో దూకి ఒకరి ఆత్మహత్య

ఆచంట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పెదమల్లం వద్ద గోదావరిలో దూకి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నెలకొంది. ఆచంట పోలీసులు తెలిపిన వివరాలివి.. తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం మల్లేశ్వరానికి చెందిన ఎక్స్‌కవేటర్ యజమాని బొలిశెట్టి నరసింహారాజు(46) వారి తాలూకు కుటుంబ ఆస్తులు పంపకాలు చేయడం లేదని మనస్తాపం చెంది శనివారం పెదమల్లం వచ్చి గోదావరిలో దూకేశాడు. ఈ సమాచారం పోలీస్, కుటుంబ సభ్యులకు తెలియడంతో గోదావరిలో సుమారు రెండు గంటల పాటు గాలించగా అతడు విగతజీవిగా లభ్యం అయ్యాడు. మృతుడు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు

ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి : ఎంపీ పుట్టా

ఏలూరు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యం అని పిల్లలు, పెద్దలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ సూచించారు. విజయవాడ అను కార్డియాక్ అండ్ న్యూరో హాస్పటల్స్ సహకారంతో ఏలూరు ప్రభుత్వాసు పత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత కార్డియాలజీ, న్యూరాలజీ వైద్య సేవలను ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణతో కలిసి శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్య సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ ఉచిత వైద్య సేవలను వినియోగించు కోవాలన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మరింత మెరుగైన సేవలకు, ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నానన్నారు. ఎంపీ మహేశ్‌కుమార్ యాదవ్ ఆసుపత్రికి సీఎస్ఆర్ నిధుల కింద రూ.కోటి విలువైన ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన యంత్ర పరికరాలను అందజేశారన్నారు. ప్రతి శుక్రవారం, మంగళవారం కార్డియాలజీ, న్యూరాలజీ వైద్య సేవల ను ఆసుపత్రిలో వైద్యులు అందిస్తారన్నారు. సమావేశంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు, టీడీపీ నాయకులు ఎస్ఎంఆర్ పెదబాబు, అను ఆసుపత్రి వైద్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.


ఏలూరులో ఉచిత కార్డియాలజీని ప్రారంభిస్తున్న ఎంపీ పుట్టా, ఎమ్మెల్యే బడేటి

అణువణువునా గాలింపు..

» విజయవాడ నుంచి వచ్చిన ప్రత్యేక టీం
» భువనపల్లి వాసుల్లో ఆందోళన
» సాధారణ తనిఖీలన్న సీఐ రజనీ కుమార్

నిడమర్రు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గంజాయి వంటి మాదకద్రవ్యాలు వినియోగించినా విక్రయించినా కఠినచర్యలు తప్పవని ఈగల్ టీమ్ సీఐ ఎం.రవీంద్ర హెచ్చరించారు. శనివారం భువనపల్లి గ్రామ పరిసర ప్రాంతాలతోపాటు గణపవరం ఇందిరమ్మ కాలనీలో ఈగల్ టీమ్ సభ్యులు కార్డన్ సెర్చ్ (సీఎస్‌వో) నిర్వహించారు. స్థానిక సీఐ రజనీ కుమార్ ఆధ్వర్యంలో విజయవాడ నుంచి వచ్చిన ప్రత్యేక ఈగల్ టీమ్ సభ్యులు, సీఆర్పీఎఫ్ దళాలు, జిల్లా పోలీస్ యంత్రాంగం కలిసి అనుమానిత షాపుల్లో క్షుణ్ణంగా పరిశీలించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి వచ్చిన డాగ్ స్క్వాడ్ అణువణువునా గాలించింది. అనుమానితుల ఆధార్ కార్డులను పోలీసులు సేకరించారు. సీఐ రజనీకుమార్ మాట్లాడుతూ ఈగిల్ ఐజీ రవికృష్ణ, ఎస్పీ శివకిషోర్ ఆదేశాల మేరకు ఈకార్డన్ సెర్చ్ నిర్వహించినట్టు తెలిపారు. తెల్లవారు జామున ఐదు గంటల నుంచే తనిఖీలు ప్రారంభం కావడంతో స్థానికుల్లో భయాందోళనరేకెత్తాయి. తమ గ్రామంలో ఏం జరుగుతుందో తెలియక గందరగోళం తలెత్తింది. డ్రోన్ కెమెరాలు సైతం వినియోగించడం గమనార్హం. సీఐ మాట్లాడుతూ ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల్లో చైతన్యం కోసం ఇ లాంటి కార్డన్ సెర్చ్‌లు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈగల్ టీమ్ ఎస్ఐలు ఎం.వీరంజనేయులు, ఉదయ్ భాస్కర్, భీమడోలు సీఐ విల్సన్, గణపవరం, నిడమర్రు, ద్వారకాతిరుమల మండలాల ఎస్ఐలు ఎ.ఫణికుమార్, కె.రమేశ్, సుధీర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


భువనపల్లిలో తనిఖీలు చేస్తున్న ఈగల్ టీమ్ సభ్యులు

నిర్లక్ష్యం

జుత్తిగ సొసైటీలో దెబ్బతిన్న గోనె సంచులు
రూ.1.60 లక్షల నష్టం
అధికారుల తీరుపై విమర్శల వెల్లువ


జుత్తిగ గోదాంలో ఉన్న గోనె సంచులు

పెనుమంట్ర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని జిల్లా ఉన్నతా ధికారులు ఆదేశాలను సైతం లెక్కచేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు దారితీస్తుంది. పెనుమంట్ర మండలంలోని వ్యవసాయ పరపతి సహకార బ్యాంకుల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. రైతు పండించిన ధాన్యాన్ని తేమ శాతాన్ని నిర్ధారించిన అనంతరం రైతులకు గోనె సంచులను అందించి అవి నిర్దేశించిన రైస్ మిల్లుకు విక్రయానికి తరలించాల్సి ఉంది. గతంలో రైతాంగం ఎదుర్కొన్న ఇబ్బందులు పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో పశ్చి గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి పలుమార్లు గోనె సంచెలు సిద్ధం చేసుకోవాలని రెవెన్యూ, రైస్ మిల్లర్లకు, సొసైటీ కార్యదర్శులకు, త్రిసభ్య కమిటీ సభ్యులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఆదేశాలను అమలు కావడం లేదనడానికి పెనుమంట్ర మండలం జుత్తిగ సొసైటీలో గత పంటలో ధాన్యం కొనుగోలు చేసేందుకు రైస్ మిల్లర్ల నుంచి గన్ని బ్యాగ్స్‌ను సేకరించి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచేందుకు నిల్వ ఉంచిన గోనె సంచులు దెబ్బతిన్నాయి. సకాలంలోనే తిరిగి రైస్ మిల్లుకు గోనె సంచులు తరలించాల్సి ఉండగా సొసైటీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సహకార సంఘంలో ఒక మూల గోనె సంచులు దర్శనమిస్తున్నాయి. ఈనెల 27న తొలి ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు జేసీ సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో శుభ్రం చేసేందుకు సైతం అధికారులు ప్రయత్నించకపోవడం శోచనీయం.

జుత్తిగ సొసైటీలో..

పెనుమంట్ర మండలం జుత్తిగలో లక్ష అరవై వేల రూపాయలు విలువ చేసే 11వేల గోనె సంచులు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నష్టం వాటిల్లింది. ఆంధ్రజ్యోతి పరిశీలనలో భాగంగా సోమరాజు ఇల్లిందలపర్రు, మాముడూరు, పొలమూరు, పెనుమంట్ర, ఆలమూరు, తదితర సహకార సంఘాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అధికారుల మధ్య సమన్వయ లోపమా...? కొనుగోలు కేంద్రాల్లో సహకార సంఘం కార్యదర్శి, కొనుగోలు కేంద్రం సిబ్బంది, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ అధికారుల సమన్వయంతో ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణ చేయాలి. ధాన్యం కొనుగోలు కేంద్రంలో మిగిలిన సంచులు వెనక్కి పంపించి కొత్త గన్ని బ్యాగ్స్‌ను అందుబాటులో ఉంచాలి.. మండలంలో ఆ పరిస్థితి కనిపించలేదు.

ఒక ఉద్యోగికి రెండు చోట్ల జీతాలా ?

జుత్తిగ సహకారం సంఘంలో పనిచేస్తున్న రమణ సోమరాజు ఇల్లిందలపర్రు సహకార బ్యాంకులో ఇన్‌చార్జిగా విధులు నిర్వరిస్తున్నారు. ఈ ఉద్యోగి సోమరాజు ఇల్లిందలపర్రులో నెలకు రూ.17 వేలు, జుత్తిగ సహకార సంఘంలో సుమారు రూ.20 వేలు జీతం తీసుకుంటున్నట్టు సమాచారం. దీనిపై రైతులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. సహకార సంఘ అధికారులు పర్యవేక్షణ కొరవడడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో బేబీ కిట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఘనంగా ఎమ్మెల్యే ఆరిమిల్లి జన్మదిన వేడుకలు

తణుకు, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి కూటమి నాయకులు, అభిమానులు తణుకులో పలు సేవా కార్యక్రమాలు, ఆలయాల్లో ఆరిమిల్లి పేరుతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉన్నారు. కూటమి నాయకులు, అభిమానులు రెడ్ క్రాస్ భవనంలో రక్తదానం చేశారు. మునిసిపల్ కార్యాలయం వద్ద అన్నదానం, అన్నక్యాంటీన్‌లో పేదలకు భోజనాలు, సంధ్యాజ్యోతి, మానేపల్లి నారాయణమూర్తి వృద్ధాశ్రమంలోనూ అన్నదానం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, బేబీ కిట్‌లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే ముళ్ళపూడి వెంకట కృష్ణారావుతో పాటు కూటమి నాయకులు మంత్రిరావు వెంకటరత్నం, కలగర వెంకటకృష్ణ, డాక్టర్ దొమ్మేటి వెంకటసుధాకర్, బసవా రామకృష్ణ, వంటిద్దు రాజా, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


పార్టీ కండువాలు కప్పుతున్న విప్ నాయకర్

వైసీపీకి ఎల్‌బీ చర్లలో భారీ షాక్

సర్పంచ్‌తో సహా మరో వందమంది జనసేనలో చేరిక

నరసాపురం,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నరసాపురం మండలం ఎల్‌బీ చర్ల పంచాయతీలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. సర్పంచ్ గుబ్బల యమున భాను, వడ్డీకాసులు, బొడ్డు ఆశిష్‌కుమార్, జల్లి నరేష్ వైసీపీకి రాజీనామా చేశారు. వీరంతా విప్ నాయకర్ సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. వీరితో పాటు మరో వంద మంది వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ 15 నెలల కూటమి పాలన చూసిన తరువాత చాలామంది వైసీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి మరికొంత మంది చేరుతారన్నారు. మైలా వసంతరావు, గుబ్బల మార్రాజు, ఆకన చంద్రశేఖర్, కోటిపల్లి వెంకటేశ్వరావు, డి.గంగాధర్, వాతాడి కనకరాజు, సంజీవరావు, బందెల రవీంద్ర పాల్గొన్నారు.

కుస్తీ పోటీల్లో పెదవేగి గురుకులం విద్యార్థుల ప్రతిభ


విజేతలతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

పెదవేగి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పెదవేగి డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ గురుకులం విద్యార్థు లు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో రెండు బంగారు, మరో రెండు కాంస్య పతకాలు సాధించి ఉత్తమ ప్రతిభ చాటారు. ఎన్టీఆర్ జిల్లా నున్నలో జరిగిన 19 ఏళ్ల విభాగం రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో మొత్తంగా 18 పతకాలను సాధించారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా 19 ఏళ్ల విభాగం జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. సీహెచ్.రాజు 97 కిలోల విభాగంలో, కె.అభిలాష్ 70 కిలోల విభాగంలోనూ బంగారు పతకాలు సాధించారు. 70 కిలోల ఫ్రీస్టయిల్ విభాగంలో పి.సంఘత్, 86 కిలోల విభాగంలో జె.వినయ్ కాంస్య పతకాలు సాధించారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఏవీ.శివప్రసాద్, పీడీ జయరాజు, ఉపాధ్యాయులు వై.శ్రీనివాసరావు, నిర్మల అభినందించారు.

ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ ?

» ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఐదు వేల మంది రాయాలని అంచనా !
» సంక్షోభాన్ని పరిష్కరించే దిశగా కేంద్రం జోక్యం ?

ఏలూరు అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీస్ టీచర్లను ఒకింత ఆందోళనకు గురిచేస్తున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) తప్పనిసరి నిబంధననుంచి మినహాయింపులు వచ్చే అవకాశాలున్నట్టు సంకేతాలు వస్తున్నాయి. ఇప్పటికే టెట్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రివ్యూ పిటిషన్‌ను పలు రాష్ట్రాలు, ఉపాధ్యాయసంఘాలు, ఉపాధ్యాయులు దాఖలు చేయగా, దేశవ్యాప్తంగా ఇన్‌సర్వీస్ టీచర్లనుంచి టెట్ మినహాయింపునకు పెద్దఎత్తున డిమాండ్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సీనియర్లకు టెట్ తప్పనిసరిపై ఏర్పడిన సంక్షోభాన్ని పరిష్కరించే దిశగా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోనున్నట్టు తెలుస్తోంది. సీనియర్ ఉపాధ్యాయులకు టెట్‌వల్ల ఎలాంటి అసౌకర్యం కలుగబోదని కేంద్రం భరోసా ఇవ్వడంతోపాటు, అవసరమైతే చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతోన్నట్టు సంకేతాలు వస్తున్నాయి.

● ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్‌నుంచి మినహాయింపునిచ్చినట్టుగా ప్రభుత్వంనుంచి అధికారిక నిర్ణయమేదీ వెలువడలేదు. ఇదిలా ఉండగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు ఐదు వేలమంది రాయాల్సి ఉంటుందని విద్యాశాఖ ప్రాథమికంగా అంచనాకు వచ్చింది. కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)పద్ధతిన నిర్వహించే టెట్‌ను డిసెంబరు పదో తేదీన నిర్వహిం చడానికి నోటిఫికేషన్ విడుదలకాగా, గత కొద్దిరోజులుగా ఈ పరీక్షపైనే ఉపాధ్యాయుల్లో విస్తృతచర్చ జరుగుతోంది. విద్యాహక్కు చట్టం అమలుకు ముందు నియమించబడి, ఉద్యోగ విరమణకు ఐదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ సర్వీసు మిగిలివున్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యా యులంతా టెట్‌లో అర్హత సాధించాల్సిం దేనంటూ సుప్రీంకోర్టు ఇటీవలిచ్చిన తీర్పునకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఈ పరీక్షలో ఉత్తీ ర్ణత సాధించాల్సి ఉంటుంది. దీనికనుగుణంగా 2001 సెప్టెంబరు మూడో తేదీకి ముందు నియమింపబడిన టీచర్లకు టెట్ తప్పనిసరి కాదని చెబుతున్నారు.

పదోన్నతి కోసమే టెట్ !

తాజాగా పదోన్నతి కోసం టెట్ అర్హత సాధించాల్సిందేనని తెలుస్తోంది. ఆ ప్రకారం 2030వ సంవత్సరం ఆగస్టు 31వ తేదీకి ముందు ఉద్యోగవిరమణ చేసేవారు అంటే 1968 ఆగస్టు 31వ తేదీకంటే ముందుగా జన్మించిన వారు టెట్ రాయాల్సిన అవసరంలేదని వివరిస్తున్నారు. ప్రస్తుతం జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం ఇన్‌సర్వీస్ టీచర్లు కచ్చితంగా డిసెంబరులో టెట్ రాయాల్సిందేనని ఆదేశాలెక్కడాలేవని, ఒక అవకాశం కల్పించినట్టుగా మాత్రమే భావించాలని విద్యా శాఖవర్గాలు చెబుతున్నాయి. ఈ పరీక్షను పదోన్నతి కోసం శాఖాపరమైన పరీక్షలు (డిపార్ట్‌మెంటల్ టెస్టు)గా పరిగణించాలని వివరిస్తున్నాయి.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు కైకరం విద్యార్థిని ఎంపిక

ఉంగుటూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి కైకరం విద్యార్థిని ఎంపికైందని హెచ్ఎం చేబ్రోలు శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కొవ్వూరులో గురువారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో జరిగిన అండర్ 14, అండర్ 17 బాలుర, బాలికల విభాగంలో తమ విద్యార్థిని రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు. 9వ తరగతి చదువుతున్న పుష్పాల లిఖిత రాష్ట్ర స్థాయికి ఎంపికవడం ఆనందంగా ఉందని, ఇంకా మరింతగా విద్యార్థిని రాణించాలని హెచ్ఎం పేర్కొన్నారు.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి : ఏఎస్ఐ

లింగపాలెం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే ఆందోళన చెందకుండా విద్యార్థినులు వెంటనే తమ ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు చెప్పాలని ధర్మాజీ గూడెం ఏఎస్ఐ రాంబాబు సూచించారు. ధర్మాజీ గూడెం శ్రీవిద్య పాఠశాలలో ఆయన విద్యార్థినులకు గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్, మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. టోల్‌ఫ్రీ నంబర్లు 100, 112కు కాల్ చేస్తే పోలీసుల తక్షణ సాయం అందుతుందన్నారు. హెచ్ఎం చలసాని రత్నాకర్, మహిళా పోలీస్ సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

- సీఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్లో శక్తియాప్‌పై అవగాహన
- అత్యవసర సమయాల్లో తోడుగా ఉంటామన్న ఏఎస్పీ

ఏలూరుక్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):జీవితంలో ఉన్నతమైన వ్యక్తిగా రాణించాలంటే విద్యార్థి దశలోనే కష్టపడి చదవాలని ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు సూచించారు.ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు సీఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్లో శక్తియాప్‌పై ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో శక్తి బృందం అవగాహన సదస్సును శనివారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎస్పీ మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులు క్రమ శిక్షణ అలవర్చుకోవాలని, తమకు ఉన్న రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళలు, బాలికలు, యువతుల రక్షణ కోసం ప్రభుత్వం శక్తియాప్‌ను రూపొందించిందని ఈ యాప్ తమ మొబైల్‌లో ఉంటే పోలీసులు పరోక్షంగా తమతో ఉన్నట్లేనని సూచించారు. పోలీస్ సహాయం పొందాలంటే ఆ యాప్ ద్వారా సమాచారమిస్తే పది నిమిషాల్లోపు ఘటనా స్థలానికి చేరుకుంటారన్నారు. అత్యవసర సమయాల్లో 112 గాని, 181కు గాని కాల్ చేసి పోలీస్ సహాయాన్ని పొందవచ్చన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగ మణి, శక్తిటీమ్ సభ్యులు పాల్గొన్నారు. శక్తియాప్‌పై మహిళా ఎస్ఐ నాగమణి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పట్టిసీమ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు



పోలవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం శనివారం సందర్భంగా పట్టిసీమ శ్రీసుదర్శన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు, అయ్యప్ప, భవానీ దీక్షల భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి తూర్పు గోదావరి జిల్లాల గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో కాలినడకన తరలివచ్చారు. ఆలయ సిబ్బంది భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు. భూదేవి శ్రీదేవి అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పారిజాతగిరి వేంకటేశ్వర స్వామికి విశేష అలంకరణ



జంగారెడ్డిగూడెం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో తొలి శనివారం సందర్భంగా గోకుల తిరుమల పారిజాతగిరి వెంకటేశ్వర స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. వేకువ జాము నుంచి ఆలయ ప్రధానార్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామికి పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యుడు అబ్బిన దత్తాత్రేయ, సత్యవతి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం అబ్బిన దత్తాత్రేయ కుటుంబ సభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈవో కలగర శ్రీనివాస్, వేద పండితులు దాతల కుటుంబ సభ్యులను స్వామి వారి శేష వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. ఆలయానికి వివిధ సేవల రూపంలో రూ.రెండు లక్షల ఆదాయం వచ్చినట్టు ఈవో శ్రీనివాస్ తెలిపారు.

రామచంద్రరావు పేటలో శ్రీవారికి ప్రత్యేక అర్చనలు



ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రామచంద్రరావుపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని తులసీదళాలు, పుష్పాలతో అర్చనలు జరిపారు. గోవిందనామ సంకీర్తనలను ఆలపించారు. ఆలయ ప్రధానార్చకులు కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు, కోసూరి సత్యనారాయణాచార్యులు భక్తులతో, వారి గోత్రనామాలతో అర్చనలు జరిపారు. ఆలయ ఈవో నల్లూరి సతీశ్ కుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ పాలడుగు వెంకట రమాదేవి, ధర్మకర్తలు అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేయగా సిబ్బంది శ్రీనివాసరావు, పామర్తి గంగాధరరావులు భక్తులకు సేవలందించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

లింగపాలెం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చింతలపూడి సబ్ యూనిట్ మలేరియా అధికారి ప్రసాద్ వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని సింగగూడెంలో ఆయన వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. గ్రామంలో నీటి నిల్వ ఉన్న ప్రదేశాలు, లార్వా వంటి వాటిని స్వయంగా పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో మురుగు నిల్వ ఉంటే లార్వా, దోమలు పెరుగుతాయన్నారు. గ్రామాలలో దోమల వలన చికెన్ గున్యా, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. వైద్య సిబ్బంది ప్రతి రోజూ గ్రామాల్లో పర్యటించాలని సీజనల్ వ్యాధులపై వ్యాధుల గురించి ప్రజలకు అవ గాహన కల్పించాలన్నారు. సూపర్ వైజర్ ఇమ్మీబాబు, లావణ్య, శ్రీనివాసరావు, ప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న మొంథా

(5వ పేజీ తరువాయి)

ఉన్న వారి సెలవు రద్దు చేశామని, వారు వెంటనే విధులకు హాజరు కావాలన్నారు. సమీక్షలో జేసీ ఎంజె అభిషేక్ గౌడ, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి విన్నూత్న, ఆర్డీవోలు అచ్యుత్ అంబరీష్, రమణ, సర్వే శాఖ ఏడీ అన్సారి, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్, జిల్లా వైద్యాధికారి పి.జె.అమృతం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అప్రమత్తం : భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ ఏలూరు, జంగారెడ్డిగూడెంలలో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేసిందని ఎస్ఈ పి.సాల్మన్ రాజు తెలిపారు. విద్యుత్ సమస్యలు దగ్గరలోని విద్యుత్ శాఖాధికారులకు గాని 1912 నెంబర్‌కు గాని తెలియజేయాలన్నారు.

రైతుల్లో ఆందోళన : మొంథా తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే భారీ వర్షాలతో 9మండలాల్లోని 31 గ్రామాల్లో 1987 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. ప్రస్తుతం జిల్లాలో వరి సాగు వివిధ దశల్లో ఉంది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాల వరి చేలు నేలకొరిగితే నష్టం ఎక్కువగా ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. అరటి, కూరగాయల సాగుతో పాటు మామిడి, జీడితోటలలో కూడా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

ఉప్పొంగుతున్న కొల్లేరు

(5వ పేజీ తరువాయి)

45.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని సరాసరి వర్షపాతం 12.2 మిల్లీమీటర్లు నమోదు కాగా జిల్లాలో వర్షం కురిసిన మండలాల్లో వర్షపాత వివరాలు ఇలా ఉన్నాయి. బుట్టాయిగూడెంలో 33, కలిదిండిలో 26.6, ఉంగుటూరులో 22.8, కుక్కునూరులో 20.4, పెదవేగిలో 20.2, కామవరపుకోటలో 19.2, నిడమర్రులో 17.8, వేలేరుపాడులో 17.2, జంగారెడ్డిగూడెంలో 14.6, ముదినేపల్లిలో 12.6, పెదపాడులో 11.8, దెందులూరులో 11, చింతలపూడిలో 10.2, లింగపాలెంలో 9.2, ఆగిరిపల్లిలో 7.2, ఏలూరు రూరల్‌లో 6.8, చాట్రాయిలో 6.2, భీమడోలులో 5, నూజివీడులో 3.8, ఏలూరు అర్బన్‌లో 3.6, పోలవరంలో 3.6, కైకలూరులో 3.2, ద్వారకాతిరుమలలో 2.8, ముసునూరులో 2.4, టి.నరసాపురంలో 2.2, మండవల్లిలో 1.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.

కాపాడమ్మా.. నాగమ్మ

పుట్టల వద్ద మహిళల ప్రత్యేక పూజలు - పిల్లాపాపలను ఆశీర్వదించాలని వేడుకోలు


ఏలూరు మార్కెట్ యార్డు సమీపంలో పూజలు

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పర్వదినం సందర్భంగా శనివారం నగరంలోని పత్తేబాద, పోస్టల్ కాలనీ, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల వద్ద భక్తులు అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాల్లోని పుట్టల్లో పాలుపోసి కోడిగుడ్లు వేసి పసుపు, కుంకుమలతో అర్చనలు జరిపి ప్రమిదలతో దీపాలను వెలిగించి ఆరాధించారు. అశోక్‌నగర్, పంపులచెరువు, రామచంద్రరావుపేట తదితర ప్రాంతాల్లో నగరానికి చేరువలోని పుట్టల వద్ద పూజలు చేశారు. పోస్టల్ కాలనీలోని నాగదేవత ఆలయం వద్ద అర్చకులు ఊటుకూరి సాయి బాబాశర్మ పూజలు జరిపించారు.

● టి.నర్సాపురం: మండలంలోని ఎర్రంపాలెం, వెలగపాడు, వీరభద్రవరం, శ్రీరామవరం, మధ్యాహ్నపువారి గూడెం, టి.నర్సాపురం వంటి గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● పెదపాడు: మండలంలో గ్రామాలకు సమీపాల్లోని పుట్టల్లో పాలు పోసి పూజలు చేశారు.చిన్నారులు బాణసంచా కాల్చి సందడి చేశారు.

● పెదవేగి: మండలంలోని కొప్పులవారిగూడెం పంచాయతీ సీతాపురం దగ్గర ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం శనివారం ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు పూజలు నిర్వహించారు.

● కామవరపుకోట:మండలంలోని పలు చోట్ల అర్చనలు జరిపి దీపాలు వెలిగించి బాణసంచా కాల్చి చెవిపోగులు కుట్టించి ఉత్సాహంగా భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. కామవరపుకోటలోని రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో గుర్రాలచెరువు గట్టు వద్ద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద లలితా శ్రీపీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు(దుర్గబాబు), సత్యశ్రీనివాసాచార్యులు భక్తులతో సామూహికంగా అభిషేకాలు, అర్చనలు జరిపించారు. ఆడమిల్లి, తడికలపూడి, కళ్ళచెరువు,జీలకర్రగూడెం, రావికంపాడు, తూర్పుయడవల్లి గ్రామాల్లో ప్రజలు నాగుల చవితి వేడుకలను ఘనంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

● కుక్కునూరు: స్థానిక శివాలయానికి భక్తులు విశేషంగా విచ్చేసి ఆలయ ప్రాంగణంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు, పూజలు చేశారు. పలు గ్రామాల్లో భక్తులంతా గ్రామసమీపంలో ఉన్న పుట్టవద్దకు వెళ్లి పూజలు చేశారు.

● ద్వారకాతిరుమల: స్థానిక శ్రీవారి శేషాచలంపై ఉన్న పుట్టల వద్ద మహిళలు పూజలు చేశారు. ముందుగా పుట్టపై పసుపు, కుంకుమలు జల్లి పూజలు చేశారు. పాలు పోసి భక్తిని చాటుకున్నారు. శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నాగులచవితిని పురస్కరించుకుని శనివారం విశేష అభిషేకాలు జరిగాయి.

● పోలవరం: మండలంలో శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పుట్టలలో పాలు గుడ్లు వేసి పూజలు నిర్వహించారు. పట్టిసీమభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం, ప్రగడపల్లి, వింజరం, ఇటుకలకోట, ఎల్లండీపేట, చేగొండపల్లి పంచాయతీల్లో భక్తులు పూజలు చేశారు. పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న పుట్టల వద్ద ఏటిగట్టు పొడవునా ఉన్న పుట్టల వద్ద పూజలు చేశారు. పొలం పనుల్లో తెలియక ఆగ్రహం కలిగిస్తే కాటు వేయకుండా పిల్లాపాపలను కరుణించి కాపాడాలని వేడుకున్నారు.


పోలవరంలో పూజలు చేస్తున్న భక్తులు

● భీమడోలు: భీమడోలు, గుండుగొలను, పూళ్ల, పోలసానపల్లి తదితర గ్రామాల్లో శివాలయాలు, నాగేంద్ర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భీమడోలు భీమేశ్వరస్వామి, పోలసానపల్లి రామలింగేశ్వరస్వామి, గుండుగొలను భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయాల్లో ఉన్న నాగేంద్రునికి భక్తులు పూజలు నిర్వహించారు. భీమడోలులో ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు కుటుంబ సమేతంగా పుట్టలో పాలుపోసి నైవేద్యాలు సమర్పించి పండుగ జరుపుకున్నారు.

● ఏలూరు రూరల్: నాగుల చవితి పూజలను భక్తులు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఏలూరు రూరల్ మండలంలోని మల్కాపురం, చాటపర్రు, జాలిపూడి, మాదేపల్లి తదితర ప్రాంతాలలో మహిళలు పూజలు చేశారు. చలివిడి, పాలు, పండ్లు నివేదించారు.


నీరు లేకుండా ఉన్న కాలువ


కాలువలో ఉన్న మురుగు


అధ్వానంగా ఉన్న ర్యాంపు

నీరులేని కాలువలో కార్తీక స్నానాలు ఎలా?

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో పడమర లాకుల నుంచి తూర్పు లాకుల వరకు ఉన్న సుమారు ఐదు కిలోమీటర్ల మేర ఏలూరు కాలువ ఉంది. ఈ కాలువకు గోదావరి, కృష్ణా నీరు కూడా విడుదల చేస్తారు. ఈ కాలువకు రెండు వైపులా స్నానాల రేవులను నిర్మించారు. కొన్నిచోట్ల జల్లు స్నానాల కోసం ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. కార్తీక మాసం వచ్చి ఐదు రోజులైనా ఏలూరు కాలువకు నీరు విడుదల చేయకపోవడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే స్నానాల రేవుల వద్ద పరిశుభ్రత కరువైంది.

ఖాళీగా ఏలూరు కాలువ - భక్తుల ఆగ్రహం

ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏలూరు కాలువకు నీరు విడుదల చేయాలని భక్తులు కోరుతున్నారు. స్నానాల రేవులను శుభ్రపర్చాలని, రేవుల తాత్కాలిక గదులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. దేశ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసి నదులు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నా ఏలూరు కాలువకు నీరు లేకపోవడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా కార్తీక పూజలకు ఏర్పాట్లు చేయాలని మహిళలు అభ్యర్థిస్తున్నారు.


రైతుకు సూచనలు చేస్తున్న హబీబ్ బాషా

ప్రభుత్వ పథకాలు రైతులకు అందాలి

లింగపాలెం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు రైతులకు చేరువయ్యేలా కృషిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా అన్నారు. మండలంలోని ధర్మాజీగూడెం రైతు సేవా కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మట్లాడుతూ మండలంలో ఈ-పంట నమోదు ప్రక్రియను వేగవంతం చెయ్యాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామంలో ల్యాండ్ పార్శిల్ నమోదును పర్యవేక్షిస్తూనే ప్రతిరోజూ మండలంలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సమీక్ష చేసి వారికి లక్ష్యాలను నిర్దేశించాలన్నారు.అనంతరం ధర్మాజీగూడెంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్, సొసైటీ అధ్యక్షుడు నిమ్మగడ్డ సుధాకర్, నీటిసంఘం అధ్యక్షుడు మోరంపూడి వరప్రసాద్, పి.శ్రావణి పాల్గొన్నారు.

మొంథా పట్ల అప్రమత్తంగా ఉండండి

అధికారులకు ఎమ్మెల్యే చింతమనేని సూచన

పెదవేగి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధికారులకు సూచించారు.పెదవేగి మండలం దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఇంటి గోడలు నాని కూలిపోయే ప్రమాదం ఉంటుందని, అలాంటివాటిని గుర్తించి, ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే రానున్న రెండ్రోజుల్లో మొంథా తుఫాన్ ప్రభావం ఉంటుందని, అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఇప్పటి వరకు వివిధ సమస్యలపై ప్రజల నుంచి అందిన అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా శాఖాధికారులకు ఆదేశాలిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, ఈ విషయంలో పేద, ధనిక అనే భేదం లేదన్నారు. సమస్య పరిష్కారమే తమ అజెండా అని ఎమ్మెల్యే ప్రభాకర్ స్పష్టం చేశారు.


మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని



అవగాహన కల్పిస్తున్న జడ్జి మధుబాబు

చట్టాలపై ప్రజలకు అవగాహన

చింతలపూడి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజలకు చట్టాలపై అవగాహన అవసరమని జూనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.మధుబాబు అన్నారు. మండలంలోని నామవరం గిరిజన గ్రామంలో పోలీసులతో కలిసి శనివారం అవగాహన కల్పించారు. ప్రాథమిక హక్కులు, భూ వివాదాలు, కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలపై చట్టపరంగా ఎలా న్యాయం పొందవచ్చో సూచించారు. సీఐ క్రాంతి కుమార్ మాట్లాడుతూ చట్టాన్ని ఎవ్వరూ చేతిలోకి తీసుకోకూడదని, ఏ చిన్న సమస్య అయినా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఉచిత న్యాయం పొందాలనుకునేవారు కోర్టును ఆశ్రయిస్తే సహాయం అందిస్తారన్నారు. ఈ సదస్సుల వల్ల ప్రజల్లో చట్టాలపై అవగాహనతో పాటు సమాజంలో బాధ్యత, భద్రతకు దోహదపడతాయన్నారు. సమావేశంలో ఎస్ఐ సతీశ్‌కుమార్, న్యాయవాదులు ఉన్నారు.


ఏకాగ్రత గురించి వివరిస్తున్న నతానియేల్

ఏకాగ్రతతో మానసిక ఆరోగ్యం

దెందులూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో ఉంటే మానసిక ఆరోగ్యం బాగుంటుందని, అంతా ఆరోగ్య వంతులుగా ఉండవచ్చని కెరియర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిల్ డాక్టర్ హెన్నా కోమలి, డాక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. శనివారం గోపన్నపాలెంలోని సీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియేల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మెంటల్ హెల్త్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఒత్తిడికి గురికాకుండా ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో సూచించారు. డాక్టర్ వై.పోలిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఈశ్వర్, అజయ్ బాబులు విద్యార్థులకు అర్థ మయ్యేలా అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

మద్ది క్షేత్రంలో అభిషేకాలు

జంగారెడ్డిగూడెం,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని గురవాయిగూడెంలో మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో స్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. శనివారం మధ్యాహ్నం వరకు ఆలయానికి వివిధ సేవల రూపంలో రూ.1,15,450 ఆదాయం సమకూరిందని ఈవో ఆర్.వి.చందన తెలిపారు.


స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు


అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మరుగుజ్జు తనంపై అవగాహన

దెందులూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మరుగుజ్జు దినోత్సవం సందర్భంగా పోతునూరు ప్రభుత్వ ఆసుపత్రిలో దొండపాడు ఉమా ఎడ్యుకేషనల్ దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పోతునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యులు డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ చిన్నతనంలో పెరుగుదల గురించి అవగాహన ఉండాలన్నారు. సంస్థ కో ఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి, పలువురు డాక్టర్లు మాట్లాడారు.

కళా ఉత్సవ్‌లో విద్యార్థుల ప్రతిభ

నిడమర్రు అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కళా ఉత్సవ్ 2025లో ఇన్ స్ట్రుమెంట్ ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ గ్రూపులో పెదనింద్రకొలను విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. శుక్రవారం రాత్రి విజయవాడలో జరిగిన కళా ఉత్సవ్ పోటీలలో పెదనింద్రకొలను ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులు ఎం.డేవిడ్ లివింగ్‌స్టన్, జి.అముసుమంతుడు విజేతలుగా నిలిచారు. వీరు ఎస్‌సీఈ ఆర్‌టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి చేతులమీదుగా మెమొంటో, ప్రశంసాపత్రం అందుకున్నారు. వీరికి గైడ్ టీచర్లుగా షేక్ మౌలాలి, బి.సాయి దిలీప్ వ్యవహరించారు. విజేతలను డీఈవో వెంకటలక్ష్మమ్మ, డైట్ ప్రిన్స్‌పాల్ కమల కుమారి, నోడల్ ఆఫీసర్ రాజ్‌కుమార్, ఎంఈవోలు అనూరాధ, శేషగిరిరావు, హెచ్ఎం డి.సత్యేంద్రకుమార్‌రెడ్డి ఉపాధ్యాయులు అభినందించారు.


ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు


వరి చేలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త నాగేంద్రబాబు

పంట చేలల్లో నీటిని బయటకు పంపండి

పెదపాడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పంట చేలల్లోకి చేరిన నీటిని బయటకు పంపాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎన్.నాగేంద్రబాబు సూచించారు. పెదపాడు, వసంతవాడ, రాజుపేట గ్రామాల్లో పడిపోయిన పంటలను శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం వరి పాలు పోసుకునే దశలో ఉందని, గింజ రంగు మారకుండా ఉండటానికి లీటరు నీటికి గ్రాము కార్బండజమ్ లేదా 2 గ్రాముల కార్బండిజానికి మాంకోజెబ్ మందును కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే 5శాతం ఉప్పు ద్రావణాన్ని చేనుపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. అధిక వర్షాలకు పడిపోని ఎం.టి.యు 1318 వరి రకాన్ని సాగు చేసుకోవాలని సూచించారు. పెదపాడు డీసీ అధ్యక్షులు బొప్పూడి కాశీబాబు, ఏవో షేక్ ఇమామ్ ఖాసిం పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వృద్ధుడి మృతి

ద్వారకాతిరుమల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పురుగు మందు తాగి వృద్ధుడు మృతి చెందాడు. ద్వారకాతిరుమలకు చెందిన ఎన్.వెంకటేశ్వరరావు(60) శనివారం బ్రాంది షాపు వద్ద మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగాడు. అనంతరం పడిపోవడంతో స్థానికులు హుటాహుటిన అతడిని భీమడోలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

క్యాన్సర్‌పై అవగాహన

పెదపాడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సర్ సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో విజయవాడకు చెందిన మణిపాల్ హాస్పటల్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం, అనారోగ్య సమయంలో మానసిక బలం అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టరు శ్రీదివ్య, సైక్రియాట్రిస్ట్ డాక్టరు దీప్తిలు మహిళల్లో వచ్చే క్యాన్సర్ లక్షణాలు, రకాల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

పేకాడుతున్న ఎనిమిది మంది అరెస్ట్

పెదపాడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపూరు పంచాయతీ అంద్రేయపురంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్టు ఎ.ఎస్.ఐ గజపతిరావు తెలిపారు. వీరి నుంచి రూ.22,470 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎ.ఎస్.ఐ గణపతిరావు తెలిపారు.

శాంతి భద్రతలకు సహకరించండి

పెదపాడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నూజివీడు సబ్ డివిజన్ పరిధిలోని పెదవేగి, పెదపాడు, దెందులూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని, ఏ విధమైన అంశాలపైన సమావేశాలు, సామూహిక నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టాలంటే అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నూజివీడు సబ్ డివిజనల్ పోలీసు అధికారి కేవీవీఎన్‌వీ ప్రసాద్ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని ఆయన ప్రజలను కోరారు.

23వ రోజుకు నిత్య భిక్ష

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీ థియేటర్ సమీపంలోని లింగమల్లు శ్రీనివాసేంద్రబాబు ప్రాంగణంలో ఈ నెల 3వ తేదీ నుంచి ఏలూరు అయ్యప్ప అన్న సమారాధనోత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు నూకల రామకృష్ణ, అధ్యక్షులు లింగమల్లు శ్రీనివాస్, గురుస్వామి తడికమళ్ల ప్రసాద్ ఆధ్వర్యంలో నిత్యభిక్ష కార్యక్రమం 23వ రోజుకు చేరింది. శనివారం నాగులచవితి కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు, స్వాములు వచ్చి భిక్షలో పాల్గొన్నారు. శనివారం స్వాములకు నగరానికి చెందిన చెన్నంశెట్టి రాఘవ్-చిన్మయులక్ష్మి గోదాదేవి, కోటగిరి శ్రీనివాస్-సుప్రియ, కుటుంబ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. నవంబరు 19వ తేదీ వరకు నిత్యభిక్ష కొనసాగుతుందని గురుస్వామి ప్రసాద్ తెలియజేశారు.

మహిళ అదృశ్యంపై కేసు

టి.నర్సాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళా అదృశ్యంపై కేసు నమోదైనట్టు ఎస్.ఐ. ఎం.జయబాబు తెలిపారు. టి.నర్సాపురం పంచాయతీలోని మెట్టగూడేనికి చెందిన ములికి మహాలక్ష్మికి వివాహమైంది. నాలుగేళ్ల క్రితం భర్త చనిపోవడంతో ముత్యాలమ్మపేట శివారులో కాంచనమాల ఫామాయిల్ తోటలో మకాం ఉంటున్న తల్లిదండ్రులతో కలిసి ఉంటోంది. ఈ నెల 24న బొర్రంపాలెం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకుకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం గాలించినా ఆచూకి లభించలేదు. తండ్రి కలవ కొల్లి వెంకన్న ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. ఎం.జయబాబు తెలిపారు.

విద్యుత్ లైన్ల మార్పుపై హర్షం

బుట్టాయగూడెం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఇబ్బందికరంగా మారిన విద్యుత్ లైన్లను మార్పు చేయడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మండల కేంద్రంలోని అరుంధతిపేట, విప్పలపాడు గ్రామాల్లో పర్యటించినపుడు రెండు గ్రామాల ప్రజలు విద్యుత్ లైన్లు కిందకు ఉండటం వలన ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ అధికారులతో మాట్లాడి లైన్లను సరిచేయించి సమస్యను పరిష్కరించారు.

విశ్వనాథ మఠంలో పూజలు

చింతలపూడి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన విశ్వనాథమఠంలో రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పూజలు రెండ్రోజులుగా జరుగుతున్నాయి. మూడ్రోజుల పాటు జరిగే పూజా కార్యక్రమం ముగింపు రోజు ఆదివారం అమ్మవారి గ్రామోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

డిప్యూటీ ఎంపీడీవోగా వసంతకుమారి



పెదపాడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పెదపాడు మండల డిప్యూటీ ఎంపీడీవోగా వి.వసంత కుమారి శనివారం బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ ఎంపీడీవో వసంతకుమారిని కార్యాలయం ఏవో, ఇతర సిబ్బంది, గ్రామ, సచివాలయ కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా వసంతకుమారి తెలిపారు.

దెందులూరుకు ఆశీర్వాదం..



దెందులూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దెందులూరు మండల పరిషత్ కార్యాలయం డిప్యూటీ ఎంపీడీవోగా బి.ఆశీర్వాదం శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన రంప చోడవరం డివిజన్‌లో పంచాయతీరాజ్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై దెందులూరు వచ్చారు. దెందులూరు ఎంపీడీవో భీమరాజును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అందరిని కలుపుకుని మండలంలో అభివృద్ధి పనులు ముందుకు సాగేలా కృషి చేస్తానని ఆశీర్వాదం అన్నారు.

చాట్రాయి ఇన్‌చార్జి ఎంపీడీవోగా సత్యనారాయణ



చాట్రాయి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చాట్రాయి ఇన్‌చార్జి ఎంపీడీవోగా బీపీ సత్యనారాయణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న బి. రాజు సెలవుపై వెళ్ళటంతో, ముసునూరు డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణను చాట్రాయి ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ కృష్ణా జడ్పీ సీఈవో కె. కన్నమ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

ఆధార్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

ముసునూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆధార్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఏసుబాబు అన్నారు. చెక్కపల్లి చైతన్య పాఠశాలలో శిబిరాన్ని డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణతో కలిసి శనివారం ఆయన తనిఖీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ పాఠశాలలో ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాల్సిన విద్యార్థులు 143 మంది ఉన్నారన్నారు. శిబిరం ఈ నెల 30 వరకు కొనసాగుతుందని ఎంపీడీవో తెలిపారు. ప్రిన్సిపాల్ ఎం.నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీట మునిగిన రోడ్లు



రాచపట్నం వద్ద కాలువను తలపిస్తున్న ఆర్అండ్‌బీ రహదారి

కైకలూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉదయం ఎండ, మధ్యాహ్నం భారీ వానతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. రహదారులు కాలువలను తలపించాయి. కైకలూరు జాతీయ రహదారిపై టౌన్‌హాలు, రైతుబజారు, గోలి తోట, బస్టాండ్, ఎల్ఐసీ కార్యాలయం వద్ద, అటపాకలో భారీగా వర్షపునీరు చేరి రహదారి ముంపు బారిన పడింది. అంతర్గత రోడ్లు పూర్తిగా జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. కైకలూరు-కలిదిండి ఆర్అండ్‌బీ రహదారిలో రాచపట్నం వద్ద, వరహాపట్నం వద్ద సీతనపల్లి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి జల దిగ్బంధంలో చిక్కుకుంది. పక్కనే ఉన్న డ్రెయిన్లు, రోడ్డు నీటితో ఏకమవటంతో రోడ్డు కాలువను తలపించింది. చెరువుల్లో ఒక్కసారిగా నీటిమట్టం పెరగడంతో ఆక్వారైతులు వాటిని బయటకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు.

భారీ వర్షాలకు నేలవాలిన వరి పైరు



కోరుకొల్లులో నేలవాలిన వరి పైరు

కలిదిండి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు కోరుకొల్లు, సానారుద్రవరం, గోపాలపురం గ్రామాల్లో వరిపైరు నేల వాలింది. పొలాల్లో వర్షపు నీటిని ఇంజన్లతో బయటకు తోడుతున్నారు. సుమారు 200 ఎకరాల్లో వరి పైరు నేల వాలిందని మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ తెలిపారు. ముంపుకు గురైన వరి పొలాల్లో ఎకరానికి 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్‌ను పై పాటుగా వేయాలన్నారు. పొడ తెగులు, అగ్గి తెగులు వ్యాపించే అవకాశం ఉన్నందున నివారణపై అవగాహన కల్పించారు.

లాల్వ డ్రెయిన్‌పై తాత్కాలిక కాలిబాట ఏర్పాటు



కలిదిండి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): లాల్వ డ్రెయిన్‌పై తాత్కాలిక రహదారికి గండి పడటంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనాలను వేమవరప్పాడు, తామరకొల్లు మీదుగా కైకలూరుకు మళ్లిస్తున్నారు. అయితే లాల్వ డ్రెయిన్ ఆవలి వైపు నుంచి కలిదిండికి వివిధ పనుల నిమిత్తం వచ్చే పాదచారులకు ఆర్అండ్‌బీ అధికారులు పాత వంతెనపై తాత్కాలిక కాలిబాట ఏర్పాటుచేశారు. వరద ఉధృతి తగ్గిన తర్వాత రహదారి నిర్మాణ పనులు చేపడతామని ఆర్ అండ్‌బీ ఏఈఈ భాస్కర్ తెలిపారు.

'పాడి రైతుల సంక్షేమమే లక్ష్యం'



బంగారు నాణెం అందజేస్తున్న దృశ్యం

చాట్రాయి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమమే కృష్ణా మిల్క్ యూనియన్ లక్ష్యమని సంస్థ జనరల్ మేనేజర్ (పీఅండ్ఐ) డాక్టర్ పారి అన్నారు. చాట్రాయి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం సభ్యుడు, పాడి రైతు నవరం నాగేశ్వరరావు కుమారుడి వివాహం సందర్భంగా కల్యాణమస్తు పథకం కింద రూ. 20 వేలు విలువైన బంగారు నాణేన్ని డాక్టర్ పారి పెండ్లి కుమారుడికి అందజేశారు. క్లస్టర్ మేనేజర్ దిలీప్‌కుమార్, సంఘ అధ్యక్షుడు శీర్ణం పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవో సింగనపల్లి, డాక్టర్ మనోజ్‌కు సత్కారం



ముదినేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వడాలి జగన్నాథ స్వామి ఆలయ ఈవో సింగనపల్లి శ్రీనివాసరావును ఉప్పరగూడెం గ్రామస్థులు, ఆలయ కమిటీల ప్రతినిధులు శనివారం ఘనంగా సత్కరించారు. ఉప్పరగూడెం రామాలయానికి టీటీడీ నుంచి ఆర్థిక సాయం మంజూరుకు శ్రీనివాస రావు కృషి ప్రశంసనీయమన్నారు. అలాగే రాజధాని నిర్మాణానికి విరాళాల సేకరణలో అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవికి అండగా ఉన్న ఆమె తండ్రి డాక్టర్ మనోజ్‌ను కూడా సత్కరించారు. గుడివాడ కోర్టు ఏజీపీ రెడ్డి బంగారయ్య, పీఏసీఎస్ ఛైర్మన్ గులిపల్లి నాగరాజు, రామాలయ కమిటీ ఛైర్మన్ బండారు పాండురంగారావు నాయకులు రాగాల రమేష్, మరిపి శివ, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ నచ్చిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు సత్కరించారు.

లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేయండి : సీఐ



కైకలూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణ లో అనేకమంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని అలాంటి వారి గుర్తుగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కైకలూరు టౌన్ సీఐ ఏవీఎస్ రామకృష్ణ అన్నారు. పోలీసుల అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శనివారం కైకలూరు శ్రీచైతన్య స్కూల్లో విద్యార్థులకు భద్రత, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బాలికల తమ పట్ల ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే భయపడకుండా పోలీసులు, లేదా టీచర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం పోలీసు అమర వీరుల త్యాగం, నిబద్ధత అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. టౌన్ ఎస్సై ఆర్. శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

ముసునూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల భవిష్యత్తులో అనేక అనర్థాలు ఎదురవుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం ముసునూరు గురుకుల బాలికల పాఠశాలలో బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు, బాలికలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన అవగాహన సదస్సులో రాజ్యలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమని, వీటిని నియంత్రించడం అందరి బాధ్యత అన్నారు. బాలికలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా హెల్ప్ లైన్ నంబరు 1095 కాల్ చేయాలని కోరారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

కూలేందుకు సిద్ధంగా ట్యాంకులు

» ఐదేళ్లలో నిర్వహణ శూన్యం » పట్టించుకోని అధికారులు » కలుషిత నీరే దిక్కు!



గోపవరం బీసీ కాలనీలో శిథిలమైన ట్యాంక్

ముసునూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సరఫరా ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. తాగునీటి పథకాల నిర్వహణ ఐదేళ్ళుగా గాలికొదిలేయడంతో బీటలు వారి, పెచ్చులూడి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. శిథిలావస్థకు, చేరిన ఓవర్‌హెడ్ ట్యాంకుల తొలగింపు లో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఎప్పుడు కూలిపోతాయోనని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. మండల వ్యాప్తంగా 60 ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉన్నాయి. వీటిలో గోపవరం, గోగులంపాడు, యల్లాపురం, ముసునూరు, రమణక్కపేట ట్యాంకులను సూమారు 35 ఏళ్ళ క్రితం నిర్మించారు. ట్యాంకులు, స్తంభాలు సైతం బీటలు వారి పెచ్చులూడి ఐరన్ బయటపడింది. ట్యాంకుల పైకి ఎక్కేందుకు ఉన్న మెట్లు ధ్వంసమయ్యాయి. ఐరన్ నిచ్చెనలు తుప్పుపట్టి విరిగిపోయాయి. దీంతో ఈ ట్యాంక్‌ల నుంచి వచ్చే కలుషిత నీరే ప్రజలకు దిక్కవుతోంది. అయితే గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వీటి నిర్వహణ గురించి పట్టించుకోకపోవడం వల్ల మంచినీటి సరఫరా ట్యాంకుల పరిస్థితి మరింత అధ్వానంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర కావస్తున్నా శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌లపై ఎటువంటి చర్యలు తీసుకోకపోడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా జలజీవన్ మిషన్ పథకంలో నిధులు మంజూరు చేసి, కొత్త ట్యాంక్‌ల నిర్మాణాలకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిధులు రాగానే ట్యాంకుల నిర్మాణం

మండలంలో కొన్ని గ్రామాల్లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరడం వాస్తవమే. అయితే జలజీవన్ మిషన్ పథకంలో నూతన ట్యాంక్‌ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పాత ట్యాంక్‌లను తొలగించి, నూతన ట్యాంక్‌ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటాం.

- కె.సత్యప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ముసునూరు మండలం.



యల్లాపురంలో ట్యాంక్ స్తంభం దుస్థితి



పెదలంకలో పుట్ట వద్ద భక్తుల పూజలు



సింగరాయపాలెంలో ఎమ్మెల్సీ జయమంగళ పూజలు



గోపవరం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో..



నూజివీడు మండలం అన్నవరంలో స్వామికి పూజలు

చల్లంగ చూడాలి నాగన్నా..

» పుట్టలు, ఆలయాల వద్ద భక్తుల పూజలు » భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



కైకలూరు చిన్నచెరువుగట్టుపై పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

కైకలూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామ గ్రామాన నాగులచవితిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం ఉదయాన్నే ఆయా గ్రామాల్లో పుట్టల వద్ద పాలు పోశారు. చిన్నారులకు పుట్ట బూరెలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కైకలూరు చిన్నచెరువుగట్టుపై వేంచేసియున్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద, శాంప్ డ్రెయిన్ గట్టుపై ఉన్న సంతాన నాగేంద్రస్వామి ఆలయం వద్ద ఉన్న పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే అటపాక, ఆచవరం, తామరకొల్లు, వేమవరప్పాడు, వరహాపట్నం, రాచ పట్నం, భుజబలపట్నం, తదితర గ్రామాల్లో పుట్టల వద్ద భక్తుల సందడి నెలకొంది.

ముదినేపల్లి: సింగరాయపాలెం - చేవూరు పాలెం సెం టరులోని శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం లో నాగుల చవితి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. భారీ సంఖ్యలో భక్తులు దేవస్థానం వద్ద పుట్టలో పాలుపోసి సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు జరిపారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, కైకలూరు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శివకిశోర్ దంపతులు పూజలు నిర్వహించారు. శ్రీహరిపురం సర్పంచ్, పరసా విశ్వేశ్వర రావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదే వి ఆధ్వర్యంలో అర్చకులు స్వామివార్లకు పూజలు జరిపారు. నాగమల్లి చెట్టు వద్ద నాగ ప్రతిమలకు మహిళ లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ముదినేపల్లి, మండవల్లి ఎస్ఐలు వీరభద్రరావు, రామచంద్రరావు పోలీసు బందోబస్తు నిర్వహించారు. మండలంలోని పెదగొన్నూ రులో వందలాది మంది భక్తులు పుట్టలో పాలుపోసి ఆలయంలో పూజలు జరిపారు. సింగరాయ పాలెం బావాజీ మఠంలో నాగేంద్రుడికి పూజలు జరిగాయి.

● ఉప్పరగూడెంలో గ్రామస్థులు చవితినాడు తమ సంప్రదాయం ప్రకారం పార్వతీ పరమేశ్వరులకు పూజలు చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు నచ్చిరెడ్డి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. గుడివాడ కోర్టు ఏజీపీ రెడ్డి బంగారయ్య, వడాలి జగన్నాథ స్వామి ఆలయ ఈవో సింగనపల్లి శ్రీనివాస రావు, డాక్టర్ మనోజ్, పీఏసీఎస్ అధ్యక్షుడు గులిపల్లి నాగరాజు పూజలు జరిపారు.

కలిదిండి: పెదలంక నాగేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న పుట్టలో భక్తులు పాలు, గుడ్లను వేసి పూజలు చేశారు. ఈవో శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కోరుకొల్లు, వెంకటాపురంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని భక్తులు దర్శించుకుని పుట్టల వద్ద పూజలు చేశారు.

ముసునూరు: బలివే రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని పుట్టలో భక్తులు పాలు పోశారు. గోపవరంలోని సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయంలో, వలసపల్లి, కాట్రేనిపాడు, ముసునూరు, చెక్కపల్లి తదితర గ్రామాల్లోని నాగేంద్ర స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నూజివీడు టౌన్: మండలంలోని అన్నవరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి పూజలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. రామన్న గూడెం నాగేంద్రస్వామి ఆలయంలో శనివారం తెల్లవారుజాము నుంచే పూజలు జరిగాయి.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి దుగ్గిరాల బాల రావమ్మ ఆలయంలోని పుట్టలో భక్తులు పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈదులగూడెం పార్వతీ సమేత నాగేశ్వరస్వామి పుట్ట వద్ద, సురవరం ముక్తేశ్వరస్వామి ఆలయం పుట్టల వద్ద భక్తులు పూజలు చేశారు. స్థానిక విశ్వేశ్వరస్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకాలు, పూజలు జరిగాయి.

ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్?

» ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఐదు వేల మంది అంచనా !

» సంక్షోభాన్ని పరిష్కరించే దిశగా కేంద్రం జోక్యం ?

ఏలూరు అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ టీచర్లను ఆందోళనకు గురిచేస్తున్న టెట్ తప్పనిసరి నిబంధన నుంచి మినహాయింపులు వచ్చే అవకాశాలు న్నట్టు సంకేతాలు వస్తున్నాయి. ఇప్పటికే టెట్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రివ్యూ పిటిషన్‌ను పలు రాష్ట్రాలు, ఉపాధ్యాయసంఘాలు, ఉపాధ్యాయులు దాఖలు చేయగా, దేశవ్యాప్తంగా ఇన్‌సర్వీస్ టీచర్ల నుంచి టెట్ మినహాయింపునకు పెద్దఎత్తున డిమాండ్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సీనియర్లకు టెట్ తప్పనిసరిపై ఏర్ప డిన సంక్షోభాన్ని పరిష్కరించే దిశగా కేంద్ర ం జోక్యం చేసుకోనున్నట్టు తెలుస్తోంది. సీనియర్ ఉపాధ్యాయు లకు టెట్‌వల్ల ఎలాంటి అసౌకర్యం కలుగ బోదని కేం ద్రం భరోసా ఇవ్వడంతోపాటు, అవసరమైతే చట్టపర మైన చర్యలకు సిద్ధమవుతున్నట్టు సంకేతాలు వస్తున్నాయి.

● ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్‌నుంచి మినహాయింపు నిచ్చినట్టుగా ప్రభుత్వంనుంచి అధికారిక నిర్ణయమేదీ వెలువడలేదు. ఇదిలా ఉండగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు ఐదు వేలమంది రాయాల్సి ఉంటుందని విద్యాశాఖ ప్రాథమికంగా అంచనాకు వచ్చింది. కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)పద్ధతిన నిర్వహించే టెట్‌ను డిసెంబరు పదో తేదీన నిర్వహించడానికి నోటిఫికేషన్ విడుదలకాగా, గత కొద్ది రోజులుగా ఈ పరీక్షపైనే ఉపాధ్యాయుల్లో విస్తృతచర్చ జరుగుతోంది. విద్యాహక్కు చట్టం అమలుకు ముందు నియమించబడి, ఉద్యోగ విరమణకు ఐదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ సర్వీసు మిగిలివున్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యా యులంతా టెట్‌లో అర్హత సాధించాల్సిందేనంటూ సుప్రీంకోర్టు ఇటీవలిచ్చిన తీర్పునకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఈ పరీక్షలో ఉత్తీ ర్ణత సాధించాల్సి ఉంటుంది. దీనికనుగుణంగా 2001 సెప్టెంబరు మూడో తేదీకి ముందు నియమింపబడిన టీచర్లకు టెట్ తప్పనిసరి కాదని చెబుతున్నారు.

పదోన్నతి కోసమే టెట్ !

తాజాగా పదోన్నతి కోసం టెట్ అర్హత సాధించాల్సిందేనని తెలుస్తోంది. ఆ ప్రకారం 2030 ఆగస్టు 31కి ముందు ఉద్యోగవిరమణ చేసేవారు అంటే 1968 ఆగస్టు 31 కంటే ముందుగా జన్మించిన వారు టెట్ రాయాల్సిన అవసరంలేదని వివరణిస్తున్నారు. ప్రస్తుతం జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం ఇన్‌సర్వీస్ టీచర్లు కచ్చితంగా డిసెంబరులో టెట్ రాయా ల్సిందేనని ఆదేశాల్లేవని, ఒక అవకాశం కల్పించినట్టు భావించాలని విద్యా శాఖవర్గాలు చెబుతున్నాయి. ఈ పరీక్షను పదోన్నతి కోసం డిపార్ట్‌మెంటల్ టెస్టుగా పరిగణించాలని వివరిస్తున్నాయి.

28న వైసీపీ 'ప్రజా ఉద్యమం'

పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే

నూజివీడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుని ముందడుగు వేస్తే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరించేందుకు యత్నించటం దారుణమని నూజివీడు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు మేకా ప్రతాప్ అప్పారావు అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 28న జరపనున్న ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆయన వైసీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ప్రజలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ అనంత లోకాలకు..



ప్రమీలాదేవి (ఫైల్)

ఆగిరిపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయా లైన ఘటన ఆగిరిపల్లి మండలం అడవినెక్కలంలో శనివారం జరిగింది. ఎన్టీఆర్ జిల్లానున్న గ్రామానికి చెందిన దేవరశెట్టి అప్పారావు, భార్య ప్రమీలాదేవితో కలిసి నెక్కలం గొల్లగూడెం అడ్డ రోడ్డులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి దర్శనానంతరం తిరిగి వెళుతుండగా వెనుక నుంచి ఓ లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రమీలాదేవి (64) అక్కడి కక్కడే మృతి చెందగా, అప్పారావు తీవ్ర గాయాల పాలయ్యాడు. పోలీసులు శవ పంచనామా అనంతరం మహిళా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రైతు అనుమానాస్పద మృతి

ముసునూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పొలం సమీపంలో నీటితొట్టెలో రైతు మృతి చెంది ఉన్న ఘటనపై ముసునూరు పోలీసులు అనుమానాస్పద మృతిగా శనివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం. చిరంజీవి వివరాల ప్రకారం మండలంలోని వేల్పుచర్ల గ్రామానికి చెందిన రైతు జోగి వెంకట రంగరావు(49) 24వ తేదీ ఉదయం పొలానికి వెళ్లి మరలా ఇంటికి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు వెతకగా, పొలానికి సమీపంలో సుమారు మూడడుగుల లోతు ఉన్న నీటితొట్టెలో నిర్జీవంగా కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



ముదినేపల్లిలో ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

ఎక్సైజ్ సురక్ష యాప్‌పై టీడీపీ నాయకుల అవగాహన

ముదినేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ సురక్ష మొబైల్ యాప్‌పై ముదినేపల్లిలో శనివారం టీడీపీ నాయకులు మద్యం షాపులకు వెళ్లి వినియోగదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కైకలూరు నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన క్యూఆర్ కోడ్ ద్వారా మద్యాన్ని ధ్రువీకరించుకోవచ్చునని తెలిపి కరపత్రాలను పంచారు. జిల్లా కార్యదర్శి పాండురంగారావు, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి బొప్పన సుందరరామయ్య తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు గుర్తింపు కార్డులు

చాట్రాయి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆరుగొలనుపేట గ్రామానికి చెందిన 40 మంది కల్లుగీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ జారీ చేసిన గుర్తింపు కార్డులను శనివారం కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు బొల్లికొండ లక్ష్మీనారాయణ, సర్పంచ్ పుచ్చకాయల అప్పిరెడ్డి, కూటమి నాయకులు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు పానుగళ్ళ కోటేశ్వరరావు, బీజేపీ నాయకుడు డి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి : ఎంపీ పుట్టా



ఏలూరులో ఉచిత కార్డియాలజీని ప్రారంభిస్తున్న ఎంపీ పుట్టా, ఎమ్మెల్యే బడేటి

ఏలూరు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ సూచించారు. విజయవాడ అను కార్డియాక్ అండ్ న్యూరో హాస్పటల్స్ సహకారంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత కార్డియాలజీ, న్యూరాలజీ వైద్య సేవలను ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణతో కలిసి శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మరింత మెరుగైన సేవలకు, ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య మాట్లా డుతూ ఏలూరు నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నానన్నారు. ఎంపీ మహేశ్‌కుమార్ యా దవ్ ఆసుపత్రికి సీఎస్ఆర్ నిధుల కింద రూ.కోటి విలువైన ఆపరేషన్ థియేటర్‌కు అవసర మైన యంత్ర పరికరాలను అందజేశా రన్నారు. ప్రతి శుక్రవారం, మంగళవారం కార్డియా లజీ, న్యూరాలజీ వైద్య సేవలను ఆసుపత్రిలో వైద్యులు అందిస్తారన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు, టీడీపీ నాయకులు ఎస్ఎంఆర్ పెదబాబు, అను ఆసుపత్రి వైద్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న మొంథా

(5వ పేజీ తరువాయి)

ఉన్న వారి సెలవు రద్దు చేశామని, వారు వెంటనే విధులకు హాజరు కావాలన్నారు.

సమీక్షలో జేసీ ఎంజె అభిషేక్ గౌడ, డీఆర్వో వి విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీవోలు అచ్యుత్ అంబరీష్, రమణ, సర్వే శాఖ ఏడీ అన్సారి, ఏలూరు నగరపాలకసంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్, జిల్లా వైద్యాధికారి పిజె అమృతం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అప్రమత్తం

భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ ఏలూరు, జంగారెడ్డిగూడెంలలో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేసిందని ఎస్ఈ పి.సాల్మన్‌రాజు తెలిపారు. విద్యుత్ సమస్యలు దగ్గరలోని విద్యుత్ శాఖాధికారులకు గాని 1912 నెంబర్‌కు గాని తెలియజేయాలన్నారు.

రైతుల ఆందోళన

మొంథా తుఫాను ప్రభావం తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే భారీ వర్షాలతో 9మండలాల్లోని 31 గ్రామాల్లో 1987 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. ప్రస్తుతం జిల్లాలో వరి సాగు వివిధ దశల్లో ఉంది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాల వరి చేలు నేలకొరిగితే నష్టం ఎక్కువగా ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. అరటి, కూరగాయల సాగుతో పాటు మామిడి, జీడితోటలలో కూడా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

ఉప్పొంగుతున్న కొల్లేరు

(5వ పేజీ తరువాయి)

45.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని సరాసరి వర్షపాతం 12.2 మిల్లీమీటర్లు నమోదు కాగా జిల్లాలో వర్షం కురిసిన మండలాల్లో వర్షపా త వివరాలు ఇలా ఉన్నాయి. బుట్టాయిగూడెంలో 33, కలిదిండిలో 26.6, ఉంగుటూరులో 22.8, కుక్కునూరులో 20.4, పెదవేగిలో 20.2, కామవరపుకోటలో 19.2, నిడమర్రులో 17.8, వేలేరుపాడులో 17.2, జంగారెడ్డిగూడెంలో 14.6, ముదినేపల్లిలో 12.6, పెదపాడులో 11.8, దెందులూరులో 11, చింతలపూడిలో 10.2, లింగపాలెంలో 9.2, ఆగిరిపల్లిలో 7.2, ఏలూరు రూరల్‌లో 6.8, చాట్రాయిలో 6.2, భీమడోలులో 5, నూజివీడులో 3.8, ఏలూరు అర్బన్‌లో 3.6, పోలవరంలో 3.6, కైకలూరులో 3.2, ద్వారకా తిరుమలలో 2.8, ముసునూరులో 2.4, టి.నరసాపురంలో 2.2, మండవల్లిలో 1.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.